నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, గురువారం 30 మే 2024 SANGAREDDY




సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

# బురద జల్లేందుకే ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు

- అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ నాటకం
- విత్తనాల కోసం రైతులు రోడ్లపైకి వచ్చినా పట్టించుకోని ప్రభుత్వం
- పరిపాలనను పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం ఎత్తుగడ
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 29: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేసీఆర్‌పై బురదజల్లేందుకే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని ముందుకు తెచ్చాయని, ఫోన్‌ట్యాపింగ్‌తో కేసీఆర్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే ఫోన్‌ట్యాపింగ్‌ను ముందుకు తీసుకొచ్చారని, ఫోన్‌ట్యాపింగ్ అనేది కేంద్ర ప్రభుత్వంలోని హోంశాఖ అత్యవసర పరిస్థితిలో చేపడుతుందన్నారు. మొన్నటిదాక అసలు కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయడం కుదరదన్న ప్రభుత్వం ఇప్పుడు పనులు చేపడుతున్నదన్నారు. ప్రజలకు మెరుగైన పాలనను అందించి వారి సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ చూపించని ప్రభుత్వం అప్పుడు ప్రజలను దారి మళ్లించేందుకు కాళేశ్వరాన్ని ముందుకుతెచ్చి, ఇప్పుడు ఫోన్‌ట్యాపింగ్‌తో కాలం గడుపుతున్నారన్నారు. ఇదంతా చోటాభాయ్... బడేభాయ్ అడుతున్న నాటకమన్నారు. ట్యాపింగ్‌తో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రాష్ట్రంలో విత్తనాలు దొరక్క రైతులు రోడ్లపైకి వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఐదు నెలల్లోనే రాష్ట్రంలో లిక్కర్‌పై రూ.5వేల కోట్లు, బియ్యంపై వేయి కోట్లు, హైదరాబాద్‌లో భవనాలు నిర్మించుకుంటే ఆర్‌ఆర్‌ఆర్ టాక్స్‌ను వసూళ్లు చేస్తున్నరని వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఐదునెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, కాంగ్రెస్ అంటేనే స్కామ్‌లన్నారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల వారికి న్యాయం చేసే సంక్షేమ పథకాలను అమలుచేశారన్నారు. ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిని పదేండ్లలో చూపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతున్నదన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాలు, కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి అద్భుతంగా కొత్తగా కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలను నిర్మించుకున్నామన్నారు. ప్రాజెక్టులను నిర్మించుకొని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించామన్నారు. హరితహారంలో భాగంగా 286 కోట్ల మొక్కలు నాటడంతోపాటు 34లక్షల ఎకరాల్లో అడవుల విస్తరణ చేపట్టామని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మూడు రోజులపాటు అద్భుతంగా నిర్వహిస్తామని అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేసిన 14ఏండ్ల పోరాటంతో పదేండ్లలో అన్ని వర్గాలకూ న్యాయం చేశామన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రాష్ట్ర ఎంపీటీసీ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్ పాషా, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు, నాయకులు సత్యనారాయణ, యాదవరెడ్డి, బాల్‌రెడ్డి, కుమార్, శ్రీనివాస్ గౌడ్, కవిత, గణేష్‌గుప్తా, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# టెండర్ ధాన్యం, సీఎంఆర్ ఇచ్చేందుకు సిద్ధం

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి చంద్రశేఖర్



సిద్దిపేటలో మాట్లాడుతున్న రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అసోసియేషన్ నాయకులు

సిద్దిపేట, మే 29: యాసంగి 2023కు సంబంధించి లక్ష 75వేల మెట్రిక్ టన్నుల టెండర్ ధాన్యం, యాసంగి 2024కు సంబంధించిన సీఎంఆర్ ఇవ్వడానికి మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కరోనా కంటే ముందు మిల్లర్లకు అప్పజెప్పిన ధాన్యం మరాడించి ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిపారు. తదనంతరం 2021-22లో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో మిల్లుల కెపాసిటికి మించి ధాన్యం దిగుమతి చేసినట్లు తెలిపారు. అప్పటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సఖ్యతలేని కారణంగా, దీనికి మరాడించిన బియ్యం దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం వద్ద సరైన స్థలం లేక మిల్లర్ల వద్దే ఆ బియ్యం ఉండిపోయిందన్నారు. స్థలాభావం కారణంగా యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ దిగుమతి కోసం ఒక్కొక్క లారీ 3రోజులపాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లా పరిధిలో సుమారు 150 మిల్లులకు సంబంధించి రూ.100 కోట్ల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 2023 యాసంగికి సంబంధించి టెండర్ ధాన్యం నిల్వ ఉంచిన నేపథ్యంలో తరుగు, హమాలీ, గోదాం కిరాయి కలుపుకొని క్వింటాల్‌కు రూ.500 మిల్లర్లుకు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. 2019 వరకు జిల్లాలో 75వేట మెట్రిక్ టన్నుల దిగుబడి ఉండగా 2024 వచ్చే సరికి పంట దిగుబడి 4లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వ గోదాముల సంఖ్య పెరగలేదన్నారు. సమావేశంలో సెక్రటరీ బుచ్చయ్య, వైస్ ప్రెసిడెంట్ బాలకిషన్ రావు, జాయింట్ సెక్రటరీ శివకుమార్, మాజీ కోశాధికారి ఉప్పల భూపతి, అడ్వైజర్ కాశీనాథ్, మిల్లర్ మద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా ధూళిమిట్టలో నరికివేసిన హరితహారం చెట్లు

# వృక్షవిలాపం

- ధూళిమిట్టలో హరితహారం చెట్ల నరికివేత
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



మద్దూరు(ధూళిమిట్ట), మే 29: హరిత తెలంగాణే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించింది. హరితహారంలో నాటిన మొక్క లు ఏపుగా పెరిగి పచ్చదనంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ వైర్లకు పచ్చని చెట్లు అడ్డు వస్తున్నాయనే కారణంతో ఆ చెట్లను తొలిగిస్తున్నారు. దీంతో నిన్నమొన్నటి దాకా పచ్చదనాన్ని పంచిన వృక్షాలు ప్రస్తుతం మోడుగా మారాయి. సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండల కేంద్రం నుంచి చేర్యాలకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి సంరక్షించారు. మొక్కల చుట్టూ పాదులు తీసి, ఎరువులు చల్లి, ట్యాంకర్ సహాయంతో ప్రతి మొక్కకూ నీరందించి సంరక్షించారు. ఆ చెట్లు బాటసారులను ఎంతగానో ఆకర్షించేవి. అలాంటి చెట్లను ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు నిర్దాక్షిణ్యంగా నరికివేశారు. విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డువస్తే కొమ్మలను తొలిగించాలే తప్పా చెట్లను తొలిగించడమేమిటని గ్రామస్తులు మండిపడుతున్నారు. వన సంపదను కాపాడాల్సిన అధికారులే ఇలాంటి చర్యలకు పాల్పడడమేంటని ప్రకృతి ప్రేమికులు ప్రశిస్తున్నారు.



ధూళిమిట్ట రోడ్డులో..

# అధికారులపై రైతుల ఆగ్రహం

- హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు చేపల కాంట్రాక్టరుతో కుమ్మక్కయ్యారని ఆరోపణ
- కాంట్రాక్టర్ తవ్విన గండిని సొంత ఖర్చులతో పూడ్చివేసిన రైతులు
- ఘటనపై విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలి



చెరువులో జేసీబీతో గండిని పూడ్చుతున్న దృశ్యం

హుస్నాబాద్, మే 29: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివారులోని ఎల్లమ్మ చెరువులో గండికొట్టి నీటిని వృథాగా బయటకు విడుదల చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకపోవడంతోపాటు కాంట్రాక్టర్ తవ్విన గండిని పూడ్చడంలో నిర్లక్ష్యం చేసిన నీటి పారుదల శాఖ అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల అండతోనే కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా తూమును తెరవడం, చెరువుకు గండికొట్టి నీటిని విడుదల చేస్తున్నాడని ఆరోపించారు. మూడు రోజుల క్రితం కాంట్రాక్టర్ చేపలు పట్టుకునేందుకు వీలుగా చెరువులోని నీటిని బయటకు పంపేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా తూము తెరవడంతోపాటు తూములోకి నీళ్లు వెళ్లేలా గండికొట్టాడు. ఈ విషయంపై రైతులు సంబంధిత నీటిపారుదల శాఖ డీఈఈ నందాకు ఫిర్యాదు చేశారు. మూడు రోజులైనా గండిని పూడ్చక పోవడంతో బుధవారం ఉదయం చెరువు వద్దకు చేరుకున్న ఆయకట్టు రైతులు సొంత ఖర్చులతో జేసీబీ తెప్పించి గండిని పూడ్చివేశారు. సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, రైతులు బొలిశెట్టి సుధాకర్, ఆకుల శ్రీనివాస్, కొమురయ్యలతోపాటు మరో పదిమంది రైతులు చెరువు తూము వద్దకు చేరుకొని అధికారుల పనితీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మూడురోజులుగా తూము ద్వారా ఏకధాటిగా నీరు బయటకుపోవడంతో చెరువులో దాదాపు ఆరు అడుగుల నీళ్లు తగ్గిపోయాయని, ఇది అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందన్నారు. చెరువులో నీళ్లుంటే వర్షాలు ఆలస్యంగా కురిసినా పశువులు, పక్షులకు నీళ్లు దొరకడంతో పాటు బావుల్లో నీళ్లు ఉండే అవకాశం ఉంటుందన్నారు. చెరువు ఎండిపోతే బావులు ఎండిపోయి తాగేందుకు కూడా నీళ్లు దొరకవనే ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు కనీసం చెరువు వైపు చూడకపోవడం ఏంటని ప్రశ్నించారు. అనుమతి లేకుండా జేసీబీతో గండికొట్టి, దర్జాగా తూమును తెరిచి నీళ్లు బయటకు పంపుతున్నాడంటే కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కయ్యారనేది స్పష్టమవుతుందన్నారు. ఇప్పటికైనా ఈ ఘటనపై విచారణ జరిపి గండికొట్టిన వారితో పాటు సహకరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.


### అధికారుల నిర్లక్ష్యం వల్లే..



మూడురోజులుగా తూము నుంచి చెరువు లోని నీళ్లు వృథాగా పోతున్నప్పటికీ నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయం. గతేడాది వర్షాలు తక్కువగా పడి చెరువులో కొద్దిపాటి నీళ్లే ఉన్న య్. ఉన్న నీళ్లను కూడా చేపలు పట్టుకునే నెపంతో ఖాళీ చేస్తే ఆయకట్టు రైతులు, పశుపక్ష్యాదులు ఏం కావాలి. అధికారుల నిర్లక్ష్యం వల్లే చెరువులోని నీళ్లు సగంవరకు వృథాగా పోయాయి. ఇందుకు బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– బొలిశెట్టి సుధాకర్, రైతు, హుస్నాబాద్

### తెలంగాణలో గొప్ప సంగీత దర్శకులు ఉన్నారు..



చేర్యాల, మే 29: తెలంగాణ అంటేనే కనులముందు మెదిలేవి కాకతీయ తోరణం, చార్మినార్, గోల్కొండ తదితర ప్రదేశాలు. వాటినే తొలిగించడం భావ్యం కాదు. కీరవాణి గొప్ప సంగీత దర్శకుడే కావచ్చు. కానీ తెలంగాణలో అంతకన్నా గొప్ప సంగీత దర్శకులు ఉన్నారు. ప్రాంతీయ వాదంపై ఏర్పడి...కోట్లాది ప్రజలు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలోని చిహ్నాలను తొలిగిస్తే ప్రజలు క్షమించరు. రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పాటలదే.

- గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ (బాల సాహితీవేత్త, చేర్యాల)

### తెలంగాణ మకుటాన్ని మార్చడం సరికాదు..



హుస్నాబాద్ టౌన్, మే 29: తెలంగాణ మకుటమైన కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలిగించడం సరికాదు. వందల ఏండ్ల కిందటి చరిత్రను తెలుసుకోకుండా వ్యక్తిగతమైన కక్షతో చిహ్నాలను మార్చడం ప్రతిఒక్కరినీ కలిచివేస్తున్నది. మన సంస్కృతి, చరిత్రను రాజకీయ కోణంలో చూడటాన్ని ఎవరూ సహించరు. రాష్ట్ర చిహ్నంతోపాటు అధికారిక గీతాన్ని కూడా మార్చేందుకు యత్నించడం తెలంగాణ ప్రజలను అవమానించడమే.

- నాదమునుల రామారావు, కవి, హుస్నాబాద్ టౌన్

### హైదరాబాద్ అంటేనే చార్మినార్






నారాయణరావుపేట, మే 29: హైదరాబాద్ అంటేనే చార్మినార్. తెలంగాణలో కాకతీయ రాజుల వైభవం ఎనలేనిది. కాకతీయులు ప్రజల కోసం చెరువులు తవ్వించి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడిన తీరు చిరస్మరణీయం. తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఎంతో గొప్పది. అలాంటి వారిని స్మరించుకోవాలి. నేడు రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ తోరణం, చార్మినార్‌ను ప్రభుత్వం తొలిగిస్తాననడం చాలా విచారకరం. గత చరిత్రను స్మరించుకుంటేనే భవిష్యత్ తరాలకు పునాది ఉంటుంది. అందుకోసం వాటిని ఎట్టి పరిస్థితుల్లో తొలిగించకూడదు. ఎంతో ఆలోచనలతో రూపొందించిన రాజముద్రలో మార్పు అవసరం లేదు.

– ఉండాల రాజేశం, సాహితీవేత్త, గుర్రాలగుంది

### కాకతీయుల కళాతోరణాన్ని తొలిగించడం సరికాదు..



సిద్దిపేట,మే 29: పసిడి పంటలు, పశుపక్షాదుల జీవన గమనానికి, చెరువుల్లో మత్స్య సంపదకు, తెలంగాణ సంస్కృతికి, కాకతీయ రాజుల పరిపాలనా దక్షత, పోరాటలస్ఫూర్తిని కలిగించేది కాకతీయుల కళాతోరణం. ఈ కళాతోరణాన్ని తెలంగాణ రాజముద్ర నుంచి తొలిగించడం సరైన విధానం కాదు. ఎన్నో దేశాలు, రాష్ట్రాలు గతంలో ఉన్నటువంటి పాలకులు ఆమోదించిన రాజముద్ర తర్వాత వచ్చిన పాలకులు ఆమోదించడం మన సంప్రదాయం. ఇది మార్చాలనేటువంటి అభిప్రాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. రాష్టం ఏర్పడిన కొత్తలో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయి ప్రజలందరితో మెప్పుపొందినది మన రాజముద్ర. ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం కాకతీయ కళాతోరణంతో కూడినటువంటి రాజముద్రను అధికారం ముద్రగా ప్రకటించింది. దీన్ని ఇలాగే కొనసాగిస్తే ప్రజల అభిప్రాయాన్ని కూడా గౌరవించినట్లు ఉంటుంది.

- వీవీ కన్నా కళాకారుడు, కవి

### తెలంగాణ పాటపై ఆంధ్ర పెత్తనమా..



సిద్దిపేట, మే 29: తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రికార్డు చేసేటటువంటి పనిని ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఎంఎం కీరవాణికి అప్పగించడం మన తెలంగాణ కళాకారులను, సంగీత కళాకారులను అగౌరపర్చినట్లే. తెలంగాణ ఉద్యమాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఆటపాటలతో ఉధ్రూత లుగించి తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన భూమిక పోషించిన ఇక్కడి కళాకారులను అవమానించడమే. ముఖ్యమంత్రి రేవంత్‌కు తెలంగాణ ప్రాంతంలో ఏ ఒక్క సంగీత దర్శకుడు కనబడలేదా, వందలమంది సినీ సంగీత దర్శకులు ఉన్నప్పటికీ ఆంధ్ర వ్యక్తిని ఎంచుకోవడం దేనికి సంకేతం. తెలంగాణ రాష్ట్రీయ గీతంగా జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం అనేటువంటి దాదాపు 15 చరణాలు అందెశ్రీ రాశారు. ఆ పాటను తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ స్వల్ప మార్పుచేర్పులతో ప్రధానమైనటువంటి నాలుగు చరణాలను మార్చి రాష్ట్రీయ గీతంగా చేయాలన్న కేసీఆర్ అభిప్రాయాన్ని అందెశ్రీ ఆనాడు ఒప్పుకోలేదు. అటువంటి సందర్భంలో రాష్ట్ర గీతంపైన నిర్ణయం వాయిదా పడింది.

- రాయారావు సత్యదీప్, సంగీత దర్శకుడు

### కాకతీయ చిహ్నం మార్పు చారిత్రక విధ్వంసమే..



వర్గల్, మే 29: సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకతీయ తోరణం, చార్మినార్ లాంటి చారిత్రక కట్టడాల( ప్రాకారం)ను తొలిగింపుపై తీసుకున్న నిర్ణయం శతాబ్దాల ఆనవాళ్లను ధ్వంసం చేయడమే. ఒక రాజ్యంపై మరోరాజ్యం గెలుపు, ఓటములు ఆయా ప్రాంతీయ సంస్కృతిక నేపథ్యం, ఆధిపత్యాలపై ఆధారపడి ఉంటాయి. కాకతీయ రాజులు పోరాడింది ముస్లిం రాజుల ఆధిపత్యంపై మాత్రమే. తెలంగాణ భౌతికవాదం, అస్థిత్వంపై ఏమాత్రం కాదు. ఎన్నో ఏండ్ల నుంచి, ఎన్నో త్యాగాల నుంచి బయటపడిన తెలంగాణ ప్రాంతం కేసీఆర్ నాయకత్వంలో ప్రపంచపటంపై లిఖించుకున్నది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం పేరుతో కాంగ్రెస్ తీసుకున్న చిహ్నాల మార్పు ఎంతమాత్రం శ్రేయస్కారం కాదు. సీఎం రేవంత్‌రెడ్డికి అంతగా ఆరాటం ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల జీవితాల్లో మార్పు తేవాలి. కానీ ఇలా రాష్ట్ర చిహ్నాల పేరిట చారిత్రక ఆనవాళ్లను ధ్వంసం చేస్తే తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురికాకతప్పదు.

- బుడిగె స్వామి, గోవిందాపూర్ గ్రామం, వర్గల్ మండలం (పల్లెసుద్దుల కళాకారుడు)

### రాష్ట్ర అధికార చిహ్నంలో మార్పులు అవసరం లేదు




రాష్ట్ర అధికార చిహ్నంలో మార్పులు అవసరం లేదు. ప్రజల మనోభావాలను దెబ్బతీయడానికి చిహ్నంలో మార్పులు తీసుకురావడం సహించేది లేదు. చిహ్నంలో కాకతీయ తోరణం, చార్మినార్‌ను తొలిగించాలని కాంగ్రెస్ సర్కారు తన ముద్ర వేయడానికి మార్పులు తీసుకొస్తామని ప్రకటించడం సబాబుకాదు. ఢిల్లీ సుల్తాన్ అలావుద్దీన్‌ఖిల్జీ దాడిని తిప్పికొట్టి విజయం సాధించిన నేపథ్యంలో కాకతీయరాజులు కాకతీయ కళాతోరణానికి అప్పటి నిజాం ప్రభుత్వం స్వయంగా స్టాంపు విడుదల చేసింది. చార్మినార్ హిందూముస్లిం ఐక్యతకు ప్రతీక ఇలాంటి ప్రత్యేకతలు ఉన్న చిహ్నాలను మార్పు చేయాలన్న ఆలోచనను కాంగ్రెస్ సర్కారు ఉపసంహరించుకోవాలి.

- రాళ్లబండి వీరాచారి, ప్రముఖ, కవి, రచయిత, కానుకుంట, గుమ్మడిదల మండలం

# మంజీరా బ్యారేజ్‌కు సింగూరు నీరు

పుల్కల్, మే 29: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలపరిధిలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు నుంచి బుధవారం మంజీరా బ్యారేజ్‌కు నీటి పారుదల శాఖ అధికారులు తాగు నీటిని విడుదల చేశారు. వేసవి దృష్ట్యా మంజీరా పరీవాహక ప్రాంతాల ప్రజలకు తాగు నీరందించేందుకు జల విద్యుత్ కేంద్రం నుంచి 1460(0.30) టీఎంసీల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి విలేకరులతో తెలిపారు. ప్రాజెక్టు నుంచి అధికారులు నీటిని దిగువకు విడుదల చేసిన సందర్భంగా నది పరీవాహక ప్రాంతాల ప్రజలు, గొర్లకాపరులు, మత్స్యకారులు అటు వైపునకు వెళ్లకూడదని హెచ్చరించారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29. 917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 14.740 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



జల విద్యుత్ కేంద్రం గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

# విత్తనాలు,ఎరువులకు కొరత లేదు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
- జిల్లాకేంద్రంలో పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ, మే 29: వానకాలం సాగు కోసం మెదక్ జిల్లాలో విత్తనాలు, ఎరువులకు కొరత లేదని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రంలో గోదామ్‌లను సందర్శించారు. రైతులకు పంపిణీ చేస్తున్న జీలుగ విత్తనాలు, ఎరువుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానకాలం జిల్లాలో 3,73,509 ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారన్నారు. దీనిలో వరి 3,27,113, పత్తి 4,0169 ఎకరాలు, మొక్కజొన్న 2,820 ఎకరాలు, కంది 1,125 ఎకరాలు, ఇతర పంటలు 1,832 ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు తయారు చేశారన్నారు. ప్రణాళిక అంచనాల ప్రకారం విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 32,088 వేల ప్యాకెట్ల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి డీలర్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని, తమ దుకాణాల్లోని స్టాక్ వివరాలు బోర్డుపై స్పష్టంగా ఉంచుతూ వాటి వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. గుడువు ముగిసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అమ్మరాదన్నారు. ప్రతి అమ్మకానికి సంబంధించి రసీదు రైతులకు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు ఎక్కడైనా విక్రయాలు జరిగితే రైతులు వ్యవసాయధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు నాటుటకు జూన్ రెండోవారం వరకు సమయం ఉందన్న విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాలో 6,400 క్వింటాళ్లు అవసరం అవుతాయని, ప్రస్తుతం ఇప్పటివరకు 4,462 క్వింటాళ్లు రైతులకు అందించామని చెప్పారు. మిగిలిన 1,938 క్వింటాళ్ల విత్తనాలు వారం రోజుల్లో రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ కమిటీ ఆవరణలో ఎరువుల దుకాణ యాజమానుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయధికారి గోవింద్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మెదక్‌లో ప్రాథమిక సహకార కేంద్రం గోదామ్‌లోని ఎరువులు, విత్తనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్